

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

"**ఏవుందీ**.. మీ అన్నగారు నిన్నూ నాన్ననీ, వీలైతే, అదీ నీకిష్టమైతే, నన్ను అర్జంటుగా రమ్మని రాశారు!" అన్నాను.

"దేనికి?" దీర్ఘం తీసింది మా అమ్మ.

"ఊ.. చెల్లెల్ని చూడాలనిపించిందిట, తెల్లార్లూ నువ్వే కల్లోకి వస్తున్నావుట!"

"ఆ మాట చెప్పవేం.! మా రెండో అన్నయ్యకి నేనంటే ప్రాణం. మా ఒదినే కాస్త రెటమతందిగానీ; అయినా రక్తం పంచుకు పుట్టినవాళ్ళమాయే. ప్రేమ ఎందుకుండదు.! సాయంకాలం బస్సులో బయల్దేరుదామా?" మా నాన్నని ఉత్సాహంగా అడిగింది మా అమ్మ. ఆవిడ మొహం 'వెలిగి' పోతోంది.

"అర్జంటు ఏమీ కాదుగానీ.. మెల్లగానే వెళ్ళొచ్చు. నీరజ పెద్దమనిషి అయిందిట. అదీ విషయం!" అన్నాడు మా నాన్న.

"అసలు విషయం చెప్పకుండా ఇది నానా కూతలూ కూస్తుందేం? ఖర్మ ఖర్మ.. ఊళ్ళో దీనికన్నా చిన్నవాళ్ళందరూ పెద్దమనుషులౌతున్నారు. ఇది మాత్రం గడకర్రలా ఎదుగుతూనే ఉంది ..'హూ.!" అంటూ నాకేసి ఓ చూపు గుచ్చి, "మెల్లగా వెళ్ళొచ్చు అంటారేం? అన్నకూతురు పెద్దమనిషైతే ఉండాల్సింది ముందుగా మేనత్తేగా? వాళ్ళకున్న చెల్లెల్ని నేనొక్కత్తినేనాయే.. ఏవైనా సరే.. సాయంత్రం బస్సుకి వెళ్ళేది ఖాయం.. అంతే!" అని డిక్లేర్ చేసింది.

"కోర్టుపనులని ఏం చెయ్యమంటావూ? వెడితే నువ్వెళ్ళు. నేను మాత్రం ఇప్పుడు రాలేను.!" ఖరాఖండీగా చెప్పేశాడు మా నాన్న.

"అంతేలెండి.! అత్తవారి తరఫువాళ్ళంటే ప్రేమ మీకెప్పుడుంది గనకా? నీ సంగతేమిటే భడవా?" నన్నడిగింది మా అమ్మ.

"నేనూ నువ్వూ ఇద్దరం వెళ్తే నాన్నకి వండిపెట్టేదెవరూ? నేనూ నాన్నతోపాటు ఇక్కడే ఉంటాను. పేరంటం రోజుకి ఇద్దరం వస్తాం!" అన్నాను.

"పెద్ద వండిపెట్టే వంటలక్క బయల్దేరింది.! పేరంటం రోజున వస్తుందిట. పేరంటం రోజున..హూ.. రేపోమాపో నువ్వూ పెద్దమనిషివౌతావు. నలుగురూ రావాలా? వద్దా? మనం వెళితే వాళ్ళొస్తారుగానీ, నన్నుముట్టుకోకు నామాల కాకి అంటే వాళ్ళూ అదే అంటారు.! అయినా మీ తండ్రీ కూతుళ్ళు ఎవరిమాటైనా వినేరకం అయితేగదా చెప్పటానికి!" దులపాల్సిన నాలుగూ దులిపేసి లోపలికిపోయింది మా అమ్మ. పుట్టింటికెళ్ళే ఛాన్సు వస్తే ఏ ఆడది మాత్రం ఎందుకు వదులుకుంటుందీ? అందునా ముగ్గురు అన్నల తరవాత పుట్టిన ఏకైక చెల్లెలాయే! పుట్టింటి 'కట్నాలు' ఇలాంటి విశేషాలు వచ్చినప్పుడు 'భారీ'గా ముడతైగదా! నాలుగోరోజే స్నానం చేయించినా పదకొండోరోజున 'ఊరుబంతి' పెట్టామనీ, మమ్మల్ని రమ్మనీ మామయ్య మళ్ళీ ఓ కార్డు రాశాడు. నేనూ మా నాన్నా ఇద్దరం ఏలూరు బస్సులో బయల్దేరాం. అమ్మ ఊళ్ళో లేని యీ ఆర్రోజులూ నేనే వంట చేశాను. ఏరోజు ఏ టిఫిను, మధ్యాహ్నపు వంటకాలూ, రాత్రి వంటకాలు స్పష్టంగా నిర్ణయించుకుని మరీ చేశా. కొన్ని వంటల్ని కరణం మామ్మగారి దగ్గర నేర్చుకున్నా. పులుసుకూరలు చెయ్యడంలో ఆవిడ ఎక్స్‌పర్టు. తోటకూర పులుసు కూరా, కాకరకాయపులుసు కూరా, అరటి కాయపులుసుకూరా ఇంకా అరిటికాయ ఉప్మాకూర ఇలా చాలారకాలే నేర్చుకున్నా.

పిల్లలు నేర్చుకోవడానికి సిద్ధపడితే, పెద్దవాళ్ళు ఎంతో ప్రేమగా నేర్పుతారు. అలా నేర్పడం వాళ్ళకో గర్వకారణం అని కరణం మామ్మగారిమాటల్లో నాకు అర్థమైంది. "ఎంత బుద్ధిగా నేర్చుకుంటున్నావే సీతా.! నీకు కుదరాలేగానీ, ఊరగాయలు పెట్టడం కూడా నేర్పిస్తా!" అని చాలా ఉత్సాహంగా ఆవిడ నాకు వంటలు నేర్పింది.

మా నాన్న ఆనందం చెప్పక్కర్లేదు. టిఫిన్‌లో ఎప్పుడూ మా అమ్మకాస్త ఆవకాయపిండి వేసేది.. నంజుకోడానికి. నేనలాకాదు. అల్లం చింతపండు చెట్నీ, శనగచెట్నీ, వేరుసెనగ చెట్నీ, కొబ్బరి చెట్నీ, ఉల్లిపాయ టమోటా చెట్నీ ఇలా రకరకాలు చేసి టిఫిన్ పెట్టేదాన్ని. అలా చెట్నీలతో తినడం మా నాన్నకిష్టం. నాకూ అదే ఇష్టం. ఒక్క సాంబారు మాత్రం ఎలా చెయ్యాలో తెలీలేదు. ముక్కలపులుసూ, ధప్పళం వరకూ తెలికేగానీ 'సాంబారు' చెయ్యడం మాత్రం తెలీలేదు. కారణం, ఆ రోజుల్లో ఒక్క రాజుగారి హోటల్లో తప్ప ఇంకెక్కడా 'సాంబారు' ప్రసక్తి లేకపోవడమే.

మేం ఏలూరు చేరేటప్పటికి సాయంత్రం అయిదున్నర అయింది. మా మామయ్యలూ అత్తయ్యలు పిల్లలూ అమ్మమ్మా తాతయ్యా అందరూ ఏలూర్లోనే ఉంటారు. అగ్రహారంలో. మేం వెళ్ళేసరికి అంటే, బస్టాండుకి వెళ్ళేసరికి మెల్లగా చీకట్లుపడుతున్నై.

"సీతా.. ఇక్కడ బిర్లా హోటల్ ఉందే! చాలా బాగుంటుంది. కొంచెం టిఫిన్ చేసి పోదాం!" అని మా నాన్న నన్ను ఆ హోటల్‌కి తీసికెళ్ళాడు. నిజంగా చాలాబాగుంది టిఫిను. "అదిగో, ఆ కోమల విలాస్‌లో కూడా బాగుంటుంది. ఇంకా వసంత మహల్లో కూడా! రేపు వెళ్దాం!" అని బయటికి వచ్చాక మా నాన్న చెప్పాడు.

చిన్నప్పుడు రెండు మూడుసార్లు వచ్చానేమోగానీ, నాకంతగా ఏలూరు గుర్తులేదు. నిజంగా ఊరిని చూడటం ఇప్పుడే జిల్లా హెడ్‌క్వార్టర్ ఏలూరే. ఊరంతా దుమ్ముతో చీకిరిబాకిరిగా వుంది. మురుక్కాలవలు ముక్కుల్ని పగలగొడుతున్నై. ఇహ దోమల సంగతి మాత్రం అడగొద్దు.

'గరుడ'వాహనాల్లాగా గాల్లో ఎగురుతున్నై. జమాజెట్టీల్లాగా ఇంతింతలావున వున్నై. ఇహ సంగీతం సంగతి చెప్పక్కర్లేదు. ఎంతో మహావిద్వాంసుడైనా 'ఏలూరి దోమ' సంగీతం విని మూర్ఛబోవాల్సిందే వీటితో పోలిస్తే మా వూరి దోమలు ఉత్త బక్కపీర్లు. ఇక బస్టాండంతా చెడకంపు. పోనీ అగ్రహారంలో బాగుందా అంటే, ఇంటిముందే మురిక్కాలవ.

"అమ్మా.. యీ కంపు నేను భరించలేనే!" అన్నాను గుసగుసగా మా అమ్మతో.

"ఏం నాపసానివే! మీ వూళ్ళో యీ కంపూ దోమలూ లేవా? నోరుమూసుకో. అయినా ఏనాడైనా 'పట్నం' మొహం చూస్తేగా!" పుల్లవిరుపుగా అన్నది మా అమ్మ.

నీరజ నన్ను చూసి నవ్వింది. "ఎలా ఉన్నావు?" అనడిగా నేనూ నవ్వి.

"ఆల్‌రైట్! బాగానే వున్నా.! క్లాసులు మానడంతో సిలబస్‌లో వెనకపడ్డా - రేపట్నించే మళ్ళీ చదవాలి" అన్నది ఆరిందాలాగా.

నీహారిక నాకు మా నాన్నకీ టిఫిన్ తీసుకొచ్చింది. దిబ్బరొట్టెలూ, వెన్నా, ఆవకాయా.

"వొద్దు.. నాకు ఆకల్లేదు!" అన్నాను. మా నాన్నా అదేమాట అన్నాడు.

"వొద్దుటమ్మా ఇద్దరికీ!" నీహారిక ప్లేట్లు పట్టుకుపోయి వాళ్ళమ్మతో అన్నది.

"ఆ.! ఎక్కడో టిఫిన్ చేసి వచ్చుంటార్లే!" అన్నది మా అమ్మ.

"నాకు పీకల్దాకా కోపం వచ్చింది. ఎవర్నీ లెక్కచెయ్యకుండా, "ఏమే పెదపాడు మాలక్ష్మి కూతురా, పుట్టింటికొచ్చి 'సిబ్బి'లాగా కూచున్నావుగానీ, అయ్యో, ఆయన అసలే సిగ్గరికదా, నోరు తెరిచి ఏదీ సొంతింట్లోనే అడగరు కదా, ఇహ అత్తారింట్లో మరీ ముడుచుకుపోతారు కదా అని ఆయనకేంగావాలో గమనించావా? రుబ్బుడు పొత్రంలాగా కూచుని మీవాళ్ళతో కబుర్లేసుకున్నావుగానీ, కట్టుకున్నవాడ్నీ కన్నకూతుర్నీ గమనించావా? ఇంతోటిదానికి మమ్మల్ని అంతదూరంనించి ఎందుకు పిలవాలే? ఏం? యీ మాత్రం

దిబ్బరొట్టెలు మేం వొండుకోలేమా? ఆ మాత్రం వెన్నా ఆవకాయా మా వూళ్ళో దొరకవా? అంటూ కడిగిపారేశా..., మా అమ్మలాగా చేతులు తిప్పుతూ.

మా నాన్నకి ఓ పక్క నా యాక్షన్‌కి నవ్వొచ్చినా, అందరూ ఏమనుకుంటారో అని హడలిపోతున్నాడు. ఇలా మాట్లాడతానని ఊహించని మా అమ్మ బిక్కజచ్చి నోరు వెళ్ళబెట్టింది. ఇహ మిగతావాళ్ళు నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

''రాత్రికూడా మీరు పగలు వొండుకున్న కూరలేనా! లేకపోతే పచ్చడి మెతుకులా?'' చేతులు తిప్పుతు మళ్ళీ అన్నా.

''ఏమిటే ఆ అరాచకం మాటలూ! ఏం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?'' కోపంతో లేచింది మా అమ్మ.

''అహా.!. ఎంత పౌరుషం పొంగుకొచ్చింది! మీ పుట్టింటివారి మీద యీగకూడా వాలకూడదుగానీ మరి మా నాన్న తరపువాళ్ళు ఒక్కరూ లేకపోయినా నివషానికోసారి దండకాలు చదువుతావే? ఏవమ్మా అత్తయ్యా, నేనన్నదాన్లో తప్పేమైనా ఉందా? ఆకలి లేదన్నాం. అంతేగా! దానికి మీ ఆడబడుచు 'ఎక్కడో టిఫిన్ చేసి వచ్చుంటార్లే' అనడం మర్యాదా? చుట్టాలింటికి వెళ్ళేటప్పుడు ఎవరైనా టిఫిన్ చేసి వెడతారా? మీరు మా వూరొస్తే టిఫిన్ చేసే వస్తారా? మీ భాగ్యలక్ష్మిగారు అలా అనడం తప్పుకాదా?''మా రెండో అత్తయ్య శ్రీలక్ష్మితో అన్నా.

ఆవిడ ఏమనగలదూ! నీరజా నీహారికా ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్ళ 'డిసిప్లిన్ ప్రపంచం'లో ఏ కూతురూ తల్లితో ఇలా మాట్లాడగలదనే 'ఊహ' కూడా వాళ్ళకి అందదు.

''ఒక్కటిచ్చానంటే మాడుపగులుతుంది. నోటికొచ్చినట్టు మాట్లాడితే కాళ్ళు విరగ్గొట్టి గాడిపొయ్యిలో పెడతాను. పెద్దంతరం చిన్నంతరం ఉండక్కర్లా!'' ఇంతెత్తున లేచింది మా అమ్మ.

''అమ్మయ్య.. నీ తిట్లు తిని ఓ ఆరు సంవత్సరాలయినట్టుందే మాలక్ష్మి కూతురా! అందుకే కాస్త అల్లరి పట్టించా.!'' నవ్వి అన్నా -

దాంతో మా అమ్మ మొహం మళ్ళీ ట్యూబులైట్లా వెలిగింది.

''నేను చెప్పలేదా వదినా, ఇది నేను లేకుండా క్షణంకూడా ఉండలేదనీ! మాటలు మాత్రం మహా పెళుసనుకో!'' మురుసుకుంది మా అమ్మ.

ఆ మాత్రం అల్లరైనా చెయ్యకపోతే బతుకులో 'తీపి' ఏముంటుందీ.

ఊరిబంతి చాలా అట్టహాసంగా జరిగింది. అయితే కొన్ని అవాంతరాలు తప్పలేదనుకోండీ. ఉన్నట్టుండి మా అమ్మ, శ్రీలక్ష్మి అత్తయ్యా చాపమీదకి చేరారు. వంటవాళ్ళు చివరిక్షణంలో 'మైల'పడ్డామని కబురెట్టారు. దాంతో అందరికీ ఖంగారు. కనీసం వందమందికి భోజనాలు ఏర్పాటు చెయ్యాలి. పాపం మావయ్య అగ్గగ్గలాడుతున్నాడు. మా అమ్మమ్మ పెద్దదైపోయింది గనక లేవలేదాయే.

''సుభద్రమ్మత్తా.! నువు సరేనంటే మనిద్దరం కలిసి వంటచేద్దాం. నాకూ 'పెద్దవంట' నేర్చుకున్నట్టు ఉంటుంది!'' అన్నాను.

''ఆ మాత్రం భరవసా ఇస్తే ఇంకేం.! భేషుగ్గా చేద్దాం!'' అంటూ మా పెద్దత్త పనిలోకి దిగింది. మూడో అత్త భద్రావతీ, నీహారికా మాత్రం కూరలు తరగటంలో సహాయం చేస్తామన్నారు. ఏమో అనుకున్నాగానీ మా పెద్దత్త వంటలో నిజంగా చలాకీనే. ఆవిడ డైరెక్షన్‌లో వంట చెయ్యడం చాలా సులభం అనిపించింది. పునాసమామిడి పప్పూ, బంగాళదుంప కూర, బెండకాయ వేపుడూ, కొబ్బరి పచ్చడీ, గుమ్మడికాయపులుసూ, పులిహోరా, పూర్ణం బూరెలూ అప్పడాలూ వడియాలూ ఊరమిరపకాయలూ మాంఛి చక్కర కేళీపళ్ళూ వీటితో ఒంటిగటకల్లా భోజనాలు సిద్ధమైపోయాయి.

తిన్నవాళ్ళందరూ బాగా మెచ్చుకుని తాంబూలం వేసుకున్నారు.

"నీ కూతురు 'ఇలా చూసి అలా' అల్లుకుపోయే రకమే భాగ్యం.! చకచకా ఎంత పనిచేసిందో.! భలే తర్ఫీదిచ్చావే!" అంటూ మా పెద్దత్తయ్య నాముందే నన్ను మెచ్చుకుంటూ మా అమ్మతో అంది.

"నేను నేర్పిందేమీ లేదొదినా, అన్నీ తనంతట అదే నేర్చుకుంది!" కొంచెం గర్వంగా అంది మా అమ్మ.

"ఏమైనా అను! యీ కాలం పిల్లల్లాంటిదికాదు నీ కూతురు!" మళ్ళీ మెచ్చుకుంది మా సుభద్రత్త.

"అంటే నాకూతుళ్ళిద్దరూ పనికిమాలినవాళ్ళనేగా నీ ఉద్దేశం?" ఊడుస్తున్న చోటే చీపురు పడేసి వచ్చింది శ్రీలక్ష్మత్తయ్య.

"నీ కూతుళ్ళని నేనెందుకంటానే లక్ష్మీ! ఏదో యధాలాపంగా అన్నాను అంతే!" తేలిగ్గా అన్నది సుభద్రత్త.

"ఆ మాత్రం నాకు తెలీదా అక్కగారూ? నిజమే! వంట రెండుపూటలా మీరే చేస్తున్నారు. కాదనను! నేనూ ఖాళీగా కూచోటంలేదుగా? పిల్ల చదువులూ అవీ చూసేది నేనేగా, పరీక్షలు వొస్తున్నాయి గనక నా పిల్లలు వంటగదివైపు రాకపోవచ్చు.. కానీ వాళ్ళు పనికిమాలిన వాళ్ళు కాదే!" కోపం తెలుస్తూనే ఉంది.. శ్రీలక్ష్మమ్మత్త మాటల్లో.

మా చిన్న మావయ్య అటు రావటంతో కొంచెం సద్దుమణిగింది. ఇట్లాంటి మాటలు నాకు కొత్త. పెద్దత్త అనడం మామూలుగానే అన్నా, ఆ మాటల్లోంచి చిన్నత్త వ్యతిరేకార్థాలు తియ్యడం నాకు వింతగా అనిపించింది.

"ఏవో తేడాలు ఉన్నాయిగదమ్మా అత్తల మధ్యలో?" అన్నాను ఆ రాత్రి మా అమ్మతో.

"ఉమ్మడి కుటుంబాల్లో ఇవన్నీ సహజమేగానీ, నువ్వు మాత్రం మధ్యలో తలదూర్చకు!" వార్నింగిచ్చింది మా అమ్మ. వాసుగాడు నా మీద 'సెటైర్లు' వెయ్యడానికి ప్రయత్నించాడుగానీ, నేనే ధాటిగా వాడి నోరు మూయించా. ఆడవాళ్ళు చదువుకుంటే చెడిపోతారుట. ఆడవాళ్ళు వంటింటికే పరిమితం కావాలిట. ఇలా చాలా మటుకు మాట్లాడి నాకు కోపం తెప్పించే ప్రయత్నం చేశాడుగానీ, నేనేమీ రియాక్టు కానట్టు నటిస్తూ చీపురు తీసుకుని, "అమ్మా.. దెబ్బకి దెయ్యం వదలాలంటే చీపురుతో ఎన్నిసార్లు కొట్టాలి?" అని అరిచా. మా అమ్మ దొడ్లో ఎక్కడో 'గొప్పులు' తవ్వుతోంది గనక వినపడదని నాకు తెలుసు. ఆ మాటలు వాడ్ని ఉద్దేశించే అన్నానని వాడికీ తెలుసు. అందుకే నోరుమూసుకుని అవతలికి పోయాడు.

ఆ మరుసటి రోజున కూడా మేం అక్కడే ఉన్నాం. ఒక్క పెద్దత్త తప్ప మిగతా ఇద్దరత్తలూ వాళ్ళ పిల్లలని విడివిడిగా గదిలోకి తీసికెళ్ళి 'మింగ'బెట్టటం నా కళ్ళబడింది. మా ఊళ్ళో దాన్ని 'దొంగతిండి' అంటారు. ఆ మాటే మా అమ్మతో అంటే, "ఎవరి పిల్లలకి వాళ్ళు పెట్టుకోవటంలో తప్పేంటీ?" అన్నది. కానీ ఉమ్మడి కుటుంబంలో అలా చెయ్యడం తప్పుగదా. అదేమాట మా అమ్మతో అంటే, "రెండు రోజులుండిపోయేదానికి నీ కెందుకే అవన్నీ?" అని చికాగ్గా అంది. ఆ మాటా నిజమేగానీ, ఇవన్నీ తెలుసుకోకపోతే ఎలా?

మా అమ్మమ్మ నన్ను పిలిచి, "ఇదిగోనే సీతా.. యీ గాజులు నీకు!" అంటూ తన చేతి బంగారు గాజులు తీసినాకిచ్చింది.

"ఎందుకమ్మమ్మా?" అన్నాను. నాకెందుకో అవి తీసుకోవాలనిపించలా.

"మళ్ళీ ఎప్పుడొస్తావో ఏమో! నువ్వొచ్చినా నేను బతికి ఉండొద్దూ!?" అంటూ నవ్వింది.

"ఇప్పుడు తీసుకుంటే రుణం తీరిపోతుంది. అందుకే అవి నీ దగ్గరే ఉంచు. అవి నీ దగ్గరున్నంతకాలం హాయిగా బ్రతికేవుంటావు!" నేనన్నాను.

"ఓసినీ.! ఎన్ని మాటలు నేర్చావే! ఇదిగో భాగ్యం.. యీ రెండు గాజులూ నీ కూతురికి... ఏదేమైనా యీ విషయం గుర్తుపెట్టుకో!" అన్నది.

అన్నదమ్ములు ముగ్గురూ అంటే మా సూర్యనారాయణ, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ మామయ్యలు ప్రేమగానే మాట్లాడుకుంటారుగానీ, మా శ్రీలక్ష్మి అత్తయ్య ఇంకా భద్రావతి అత్తయ్యలే కొంచెం ఎడ-పెడగా వుంటారు. మా పెద్దత్తయ్య మాత్రం గొడ్డు చాకిరీ చేస్తూనే ఉంటుంది. పైగా భోళామనిషి

ఏలూర్లో గీతామందిరం, బడేటి పార్కు ఇవన్నీ నాకు చూపించింది చూడామణి. వాళ్ళుండేదీ అగ్రహారమే.

చక్కని చందమామలాంటి మొహం. నాలాగే పొడగరి. మాంఛి స్నేహశీలి. మా అమ్మకి తెలీకుండా మా నాన్న ఓ అయిదురూపాయలు నాకిచ్చాడు. అయిదురూపాయలంటే చాలా 'రిచ్' కిందే లెక్క. నేను నీరజనీ నీహారికనీ భార్గవినీ తీసుకుని చూడామణితో సహా సినిమాకి పోయాం. తిరిగొచ్చేటప్పుడు మొక్కజొన్న గారెలు తిన్నాం - మొక్కజొన్నల్ని నానేసి రుబ్బిచేశారు.. చూడామణీ వాళ్ళ చుట్టాలు నండూరి వారింట్లో. రుచిగానే ఉన్నాయిగానీ, నమిలీ నమిలీ పళ్ళునొప్పెట్టాయి. బడేటి పార్కు దగ్గర బండిలో మాంఛి ఉల్లిపాయలు కూరి నిమ్మరసం పిండిన మిర్చిబజ్జీలుకూడా లాగించాం. షోడాలు తాగాం కానీ, ఏలూరు షోడాలు మా వూరి షోడాల ముందు దిష్టితియ్యడానికి కూడా పనికిరావు. మావూరి సోడాలయితే ఘాటు నషాళానికి అంటుకుంటుంది.

అన్నట్టు నా ఇంకో 'కళ' గురించి చెప్పలేదుగదూ! సరే., సినిమా చూసి ఇంటికెళ్ళాక అందరం కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాం.

ఉండీ ఉండీ, "ఒసే భాగ్యం.. ఇటావే!" అని మా అమ్మమ్మ గొంతుని అనుకరిస్తూ అన్నా. మా అమ్మమ్మ ఆల్‌రెడీ కునుకుతీస్తోంది.

"ఏమిటమ్మా?" అంటూ మా అమ్మ వొచ్చి, కునుకు తీస్తున్న అమ్మమ్మని చూసి, "ఏమిటో.. ఇప్పుడే పిల్చిందీ, ఇప్పుడే నిద్దరపోతోంది!" అని వంటింట్లోకి చక్కాబోయింది.

పిల్లగాంగ్ నోరెళ్ళబెట్టి నావంక చూశారు. మన 'మిమిక్రీ' సంగతి అప్పుడే వాళ్ళకి తెలిసిందన్నమాట.

"భలే ఉందే సీతా, యీసారి భద్రావతిని ఏమార్చు!" అని ఉత్సాహంగా అడిగింది నీహారిక.

"భద్రా.. యీ కూరలు లోపలికి తీసికెళ్ళు!" మా మామయ్యలాగా గొంతుమార్చి అన్నా.

"వచ్చే..వచ్చే..!" అంటూ భద్రావతి అత్తయ్య వచ్చి చూసి, "ఏవయ్యారీయనా? కూరగాయలేవీ?" అని ఆశ్చర్యంగా అన్నది.

"ఎవరి గురించీ నువ్వనేది అత్తయ్యా?" అమాయకంగా అన్నాను.

"మీ మావయ్య గురించేనే! ఇప్పుడేగా నన్ను పిలిచిందీ!" అయోమయంగా అంది భద్రత్త.

"మావయ్య అసలు రానేలేదుగా? అదీగాక మేమందరం ఇక్కడే ఉన్నాంగా! మాకు వినిపించని పిలుపు నీకెట్లా వినిపించిందబ్బా?" అని వీరలెవెల్లో నటించా.

"అదేమిటోనే.! పిలిచినట్టు అనిపించి వచ్చా.. ఏమో! రాలేదంటున్నారుగా!" బుర్రగోక్కుంటూ లోపలికి పోయిందావిడ. మా పిల్లకాయలు నవ్వులే నవ్వులు.

ఇంకా సుభద్రత్త నీ శ్రీలక్ష్మి అత్తనీ కూడా 'ఫూల్' చెయ్యమన్నారుగానీ, ఒకేసారి అలాచెయ్యకూడదనీ, చేస్తే పట్టుపడతామనీ అప్పుడు 'థ్రిల్' పోతుందనీ నచ్చజెప్పా.

"అన్నీ నేను చూస్తూనే ఉన్నానే సీతా!" కళ్ళు తెరిచి నవ్వుతూ అన్నాడు తాతయ్య ఆయన చాలా మితభాషి.

"ఏదో సరదాకి తాతయ్యా.!" అన్నా కాస్త సిగ్గుపడుతూ.

అవాళ రాత్రివంట మా అమ్మ సుభద్రత్తా కలిసి చేశారు. శివంగిపులుసూ, కంది పచ్చడీ, అప్పడాలు, రామ్ములక్కాయచారు.

మగాళ్ళ భోజనాలయినాక ఆడవాళ్ళం అందరం కూర్చున్నాం. ఏవేవో విషయాలు మాట్లాడుతూ వుంటే మా అమ్మమ్మకూడా వచ్చి కూర్చుని తెగనవ్వించింది. పెళ్ళప్పుడు మా అమ్మమ్మకి మూడేళ్ళట. తాతయ్యకి పధ్నాలుగు. అప్పట్లో ఆడపిల్లలు దొరికేవారు కాదట. అందుకే కన్యాశుల్కం ఉండేవిట.

చాలాసేపు మాట్లాడుకుంటూ పొద్దుపుచ్చి ఎప్పటికో పడుకున్నాం. సడన్‌గా నాకు మెలుకువొచ్చింది. ఏమిటా అని ఆలోచిస్తే 'గురక' శబ్దాలు. వంద రుబ్బురోళ్ళు ఒకేసారి తిరుగుతున్నట్టు ఒకరు గురకపెడితే, ఉండీ ఉండీ బండరాళ్ళు దొర్లిపడ్డట్టు ఇంకోళ్ళూ, కుక్కలూ పిల్లులూ కలిసిగట్టుగా అరుస్తున్నట్టు ఒకళ్ళు గురకపెడితే, సైలెన్సరు లేని బస్సు ఇంజన్లా ఇంకొకరు, కప్పలు అరుస్తున్నట్లు ఒకరు, పులులు గర్జిస్తున్నట్టు ఇంకొకళ్ళు, అంతెత్తునించి నీళ్ళమీద తొండలు దూకినట్లు వేరొకళ్ళు, లక్షదెయ్యాలు ఒకేసారి అరిచినట్టు ఆరోహణ అవరోహణక్రమంలో మరొకరూ, నాకు నిద్రపడితే ఒట్టు.

గురకలో కూడా ఇందరు ఘనాపాఠీలు ఉంటారని ఇప్పటిదాకా నాకు తెలీనే తెలీదు. గుండెకి ఆడామగా భేదం లేనట్టుగా, గురకకి కూడా ఆడామగా భేదం లేదనుకుంటా. రకరకాల శబ్దాలు వెలయిస్తూ ఇల్లు మారుమోగుతోంది.

కాసేపు మధ్యగదిలోకి కాసేపు వంటగదిలోనే కాసేపు వరండాలోకి చోటు మార్చి చూశాగానీ, ఏమాత్రం మార్పుకనపడలేదు. వరండాలో అయితే గురకలతోపాటు దోమల సంగీతం. అవి కుట్టినచోట మంటా దురదా. దుప్పటి పూర్తిగా కప్పుకుని గోడకి ఆనుకుని కూర్చుని బాసీపట్టువేసి హనుమాన్ చాలిసా చదవడం మొదలెట్టా. నాపిచ్చిగాకపోతే, హాయిగా రామనామం చేస్తూ ఆనందించే హనుమంతుడు యీ 'గురకలాండ్'లోకి అసలు అడుగుపెడతాడా? పెట్టాడుబో.. తిరిగివెళ్తాడా? మొత్తానికి తెల్లారింది. 'మోతే'వారి బంగళాలని బైటనించి చూశా. లోపలికి వెళ్దాం అనుకున్నాగానీ, నేనెవరో వాళ్ళకి తెలీదుగదా. 'పెరుగుల' చెట్టు అని ఓ రావి చెట్టుకిందకి పొద్దున్నే నన్ను తీసుకుపోయింది నీహారిక. పాలూ పెరుగూ అక్కడ అమ్ముతారు. మధ్యాహ్నం మా పెద్ద పుల్లేటికుర్రుకి బయల్దేరాం నేనూ మా నాన్న మా అమ్మ. మావయ్య మా ముగ్గురికీ బట్టలు పెట్టారు.

కార్తీక మాసం.. వనభోజనాల హడావిడి. ఓ పక్క చలీ మంచూ. మరోపక్క కార్తీక స్నానాలు. యీ మాసం అంతా 'నక్తాలు' (అంటే పగలంతా ఉపవాసం ఉండి లింగోద్భవతు కాలంలో ఉపవాస విరమణ చెయ్యడం) చేసేవాళ్ళ హడావిడి అంతా ఇంతాకాదు. మా నాన్న విధిగా పాటిస్తాడు. సూర్యాస్తమయసమయానికి భోజనం రెడీ చేసే బాధ్యత నేను తీసుకున్నాను గనక మా అమ్మ హాయిగా ఊపిరి పీల్చుకుంది.

'జ్వాలాతోరణం' దాటటం నాకు భలే ఇష్టం. మా ఊరి శివలాయమూ ఇటు ఆశ్రమం కూడా యీ నెల్రోజులూ మహా రద్దీగా ఉంటాయి.

కార్తీక మాసపు ఉదయాలు అద్భుతం. చెప్పులు లేకుండా, మంచుతో నిండిన పచ్చగడ్డి మీద నడుస్తుంటే.. ఓహ్.. చల్లదనం పాదాలనించి మెదడులోకి భలేపాకుతుంది.

బావిలో నీరు వెచ్చగా ఉంటుంది గనక స్నానం చెయ్యడమూ గొప్ప ఉత్సాహాన్నిస్తుంది. "ఏకబిల్వం శివార్పణమ్" అనుకుంటూ ఒక్కోమారేడు దళాన్నీ శివలింగం మీద భక్తిగా వేస్తూ 'లింగాష్టకం' చదవడమంటే నాకు ఇంకా ఇష్టం.

అందుకే మా పాకబడి బేచ్ అందరం పొద్దున్నే స్నానాలూ గట్రా ఇళ్ళల్లో కానిచ్చి శివాలయానికి పోయేవాళ్ళం.

ఓం.. శివాయనమః అని ఒకరంటే, శివలింగాయనమః అని మిగతా వాళ్ళందరూ కోరస్‌గా అనేవాళ్ళు.

ఏమైనా, తెల్లకి తెల్లవారుఝామున లేస్తే వుండే ఆనందం ఆలస్యంగా లేవడంలోలేదు.

మంచు కప్పేసిన తామరపూలు/మొగ్గలు ఎంత బాగుంటాయో. ఒక పక్క సూర్యుడు పైపైకి వస్తుంటే, మరోపక్క మొగ్గలు విచ్చుకుంటూ వుండడం చూస్తూ ఉండటం ఎంతబాగుంటుందో.

ఏలూరినించి వచ్చి వారమైందో లేదో మళ్ళీ 'పోస్ట్' అంటూ పోస్ట్‌మేన్ మస్తాన్ మా ఇంటి ముందు నిలబడి అరిచాడు. ఉత్తరం నేనే తీసుకుని చూశా. అమ్మమ్మకి బాగోలేదుట. హాస్పటల్లో చేర్చారుట.

విషయం చెప్పగానే మా అమ్మ ఏడుపు మొదలెట్టింది. "ఎందుకు ఏడుస్తావూ? అమ్మమ్మ హాస్పటల్లో ఉంది అంతేగా? డాక్టర్లు చూసుకుంటారుగా..! మనమూ వెళ్ళిచూద్దాం.! ముందు ఏడుపు మాని బట్టలు సర్దు." అన్నారు మా నాన్న.

మళ్ళీ ప్రయాణం. ఈసారి మాత్రం నాన్న అమ్మని దించేసి వస్తానన్నారు. ఎన్ని రోజులు ఉండాలో తెలియదుగా మరి.

ఆ రాత్రి ఏలూర్లో ఉండి మరుసటి రోజున ఫస్టు బస్సుకి మా నాన్న మా వూరు వచ్చేశారు. అమ్మమ్మ కొంచెం కోలుకుందిట. అమ్మ ఇంకో రెండురోజులు అక్కడే ఉండి వస్తానన్నదిట.

రాబోయేది సంక్రాంతి.. అయితే శివరాత్రి అయ్యాకగదా! చాలారోజుల తరవాత లైబ్రరీకి వెళ్ళాను. ఆచార్యులుగారు నన్ను చూసి చాలా సంబరపడ్డారు. అంతేకాకుండా శరత్ నవల 'చరిత్రహీనులు' చదవడానికిచ్చారు.

థర్డ్‌ఫాంలో ఉండగానే 'రచయిత్రుల' హవా మొదలైంది. 'లత'గారూ 'రామలక్ష్మిగారూ' 'మాలతీ చందూర్'గారూ అప్పటికీ అందరికీ వారి రచనలద్వారా సుపరిచితులు. కొత్తగా యద్దనపూడీ, వాసిరెడ్డి సీతాదేవీ, మాదిరెడ్డి సులోచన, కోడూరి కౌసల్యాదేవీ, ద్వివేదుల విశాలాక్షి ఇలా ప్రభంజనంలా రచయిత్రులు వార, మాస, పక్ష, పత్రికల్లోకి దూసుకొచ్చారు. ఇహ రంగనాయకమ్మగారి బలిపీఠం, అరెకపూడి (కోడూరి) కౌసల్యగారి చక్రభ్రమణం మా బుర్రల్లో తిష్టవేసేశాయి.

అప్పటిదాకా పుస్తకాలని ముట్టుకోని ఆడవాళ్ళు కాస్తా వారపత్రికలలోని సీరియల్స్‌ని ఇష్టంగా చదవడం మొదలెట్టారు. మగవాళ్ళకే పరిమితమైన పత్రికలు ఇప్పుడీ రచయిత్రులు రావడంతో ఆడవాళ్ళనీ 'చదువరు'లుగా మార్చివేశాయి. పుస్తకం ముట్టుకోని మా అమ్మే యీ మధ్య సీరియల్స్ చదవటమేగాక చదువురాని ఇరుగుపొరుగు ఆడాళ్ళకి చదివి మరీ వినిపిస్తోంది.

యద్దనపూడి సులోచనా రాణి సీరియల్సే ఆడపిల్లల్ని కలల్లో ముంచి తేల్చేవి. సెక్రెటరీ నవలైతే ఇహ చెప్పక్కర్లా. అమ్మాయిలు 'రాజశేఖరం' పిచ్చిలో పడిపోయారు. అలాంటివాడే మొగుడుగా రావాలని బాహాటంగానే చెప్పేవాళ్ళు.

"రామారావు చచ్చిపోయాడే సీతా." ఏడుస్తూ వచ్చాడు పార్వతీశం ఉదయాన్నే.

"ఏమైందిరా?" ఖంగారుగా అడిగాను. రామారావు మాక్లాస్‌మేట్. బాగా ఉన్న వైశ్యకుటుంబం వాళ్ళది. మనిషి బాగుంటాడు. మనసు చాలా మంచిది.

"పెద్దచెర్లో దిగి యీతలు కొడుతుండగా మునిగి చచ్చిపోయాడుటే!" ఏడుస్తూనే అన్నాడు పార్వతీశం.

బయటకి పరిగెత్తా.. పెద్ద చెరువువైపు.

మా స్టూడెంట్స్ చాలామంది అప్పటికే వచ్చారు. చెరువు గట్టున వెల్లకిలా పడుకోబెట్టారు. రామారావు తల్లీదండ్రీ చుట్టాలూ ఒకటే ఏడుపు.

రామారావుని చూస్తే మాకెవరికీ ఏడుపు ఆగలా. మొత్తానికి 'శవాన్ని' తీసికెళ్ళారు.

పోస్టాఫీసు దాటుతుంటే, కృష్ణమూర్తి మాస్టారు అడిగారు, "శవాన్ని ఇంటికి తీసికెళ్ళారా? స్మశానానికా?" అని.

ఒక్కసారి రోడ్డుమీదే ఆగిపోయా.

మనిషి ప్రాణం ఉన్నంతసేపే పేరూ ప్రతిష్టా ఆస్తీపాస్తీ. ప్రాణం పోయాకా?

పొద్దుటదాకా రామారావు ఉన్నాడా.! ఎక్కడికెళ్ళాడూ? ఎప్పుడొస్తాడు?" ఇలా అడిగేవాళ్ళు, రామారావు చచ్చిపోగానే, "శవాన్ని ఎక్కడికి తీసికెళ్తున్నారూ? ఇంటికా? స్మశానానికా?" అని అడుగుతారు. అంతేగానీ, "రామారావుని ఇంటికితీసికెళ్ళారా ?స్మశానానికా?" అని అడగరుకదా.

శరీరంలో ప్రాణం ఉన్నంతవరకూ యీ శరీరం ‘శివం‘ ప్రాణం పోగానే ‘శవం‘. ఆ శవం దేన్నీ గుర్తించదు. ఎవర్నీ గుర్తించదు. దానికి యీలోకంతో అసలు పనేలేదు. నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు ధారగా కారుతున్నై. రామారావు మాటలూ, అల్లరీ అన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఇక మిగిలేవి అతనిని గూర్చిన జ్ఞాపకాలేగా! స్కూలుకి సెలవిచ్చారు.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments